రూ.66వేల నగదు స్వాధీనం

నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై సాయికిషోర్‌రెడ్డి

ములకలపల్లి, అక్టోబర్ 18 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా బుధవారం కంపగూడెం క్రాస్‌రోడ్ వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.66,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. ఆ వ్యక్తి నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు, అనుమతులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అందించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమ మద్యం, నగదు తరలించే వాహనాలపై నిఘా ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు మండలంలో తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాయికిషోర్‌రెడ్డి

ములకలపల్లి, అక్టోబర్ 18 : ఎన్నికల నియమావళిపై ప్రజలకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి బుధవారం పూసుగూడెం పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు కోడ్ ఉల్లంఘించకూడదని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, గొడవలు, దూషణలకు దిగరాదని, ఓటు ఎలా వినియోగించుకోవాలో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలస గ్రామంలో వైద్యశిబిరం

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మధులిక

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 18 : గుమ్మడవల్లి పీహెచ్చ్‌సీ పరిధిలోని బచ్చువారిగూడెం పంచాయతీ జీల్లేడుపాకల గొత్తికోయల వలస గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు 28మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురి వద్ద రక్తనమూనాలు సేకరించారు. జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధులిక మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ దుర్గ, పర్యవేక్షణాధికారి కృష్ణయ్య, విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

గొత్తికోయల గ్రామంలో...

రోగులను పరీక్షిస్తున్న మెడికల్ అధికారి కనకం తనూజ

చంద్రుగొండ, అక్టోబర్ 18 : జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని మెడికల్ అధికారి కనకం తనూజ అన్నారు. బుధవారం బెండాలపాడు గ్రామ శివారులోని అటవీప్రాంతం గొత్తికోయల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని రోగులను పరీక్షించారు. రక్తనమూనాలు సేకరించి, వైద్యం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల ద్వారా ఆర్థిక తోడ్పాటు

అశ్వారావుపేట, అక్టోబర్ 18 : ఖాతాదారులందరికీ బ్యాంకుల ద్వారా ఆర్థిక తోడ్పాటు ఉంటుందని మేనేజర్ మణికంఠ స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిశోధనల్లో భాగంగా బుధవారం ఏపీజీవీబీ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆర్థిక లావాదేవీలు, సంస్థాగత నిర్మాణం, రుణాల మంజూరు, రికవరీ, వడ్డీ వసూలు, స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలు, రైతుమిత్ర గ్రూపులకు అందించే సేవలు, ప్రభుత్వం నుంచి అమలవుతున్న సబ్సిడీ పథకాలను మేనేజర్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ ఐ.కృష్ణతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి మమ్ము దీవించమ్మా..!

అన్నపురెడ్డిపల్లి : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు ధనలక్ష్మీగా, శివాలయంలో అమ్మవారు కాశీ అన్నపూర్ణేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. బుధవారం ఆలయాల్లో అమ్మవార్లకు అలంకరణలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీమహాలక్ష్మి అలంకరణలో...

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 18 : దేవీశరన్నవరాత్రులు పురస్కరించుకుని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తమామిళ్లవారిగూడెంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని రూ.10,116లు నోట్లతో అలంకరించారు. రమేశ్‌చంద్రచార్య వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. పలువురు దంపతులకు పూజలు చేశారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేట, అక్టోబర్ 18 : నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు బుధవారం శ్రీ మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాలకు భక్తులు భారీగా చేరుకోవడంతో కిక్కిరిసిపోయాయి.

చంద్రుగొండలో..

దమ్మపేటలో...

అశ్వారావుపేటలో.. | అశ్వారావుపేట పట్టణంలో..

లలితాదేవి అలంకరణలో...

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 18 : పట్టణంలో పలు మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు బుధవారం శ్రీ లలితాదేవి అవతారంలో, గుర్రాలచెరువు గ్రామశివారులో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే అభిషేకాలు అలంకరణలు, దూపదీపనైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రుగొండలో...

చంద్రుగొండ, అక్టోబర్ 18 : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చీదెళ్ల పవన్‌కుమార్ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దమ్మపేటలో...

దమ్మపేట, అక్టోబర్ 18 : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దమ్మపేటలోని గాయత్రీ ఆశ్రమంలో కొలువైన గాయత్రీ అమ్మవారు శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా అయ్యప్ప ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా మండపాల్లో కొలువైన దుర్గమ్మకు నిర్వాహకులు ప్రత్యేక అలంకరణలు చేయడంతో భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రేమ్‌సుస్థిర మూర్తీజీ, అర్చకులు, ఆలయకమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు

అన్నపూర్ణాదేవి అవతారంలో...

దమ్మపేట, అక్టోబర్ 18 : మండలంలోని గణేశ్‌పాడు ఆలయంలో కొలువైన విజయదుర్గ అమ్మవారిని అర్చకులు అన్నపూర్ణాదేవిగా అలంకరించడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణదాతలు గారపాటి సూర్యనారాయణ, అనురాధ దంపతులు భక్తులకు, దీక్షాపరులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అశ్వారావుపేటలో...

బహిరంగసభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే

చంద్రుగొండ, అక్టోబర్ 18 : చంద్రుగొండ జడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొణకండ్ల వెంకటరెడ్డి గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. చంద్రుగొండ శివారులో బహిరంగ సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించి, నాయకులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు వచ్చే ప్రముఖులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలకాలన్నారు. సభకు ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ స్యులు బండి పార్థసారథిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు హాజరవుతారని, వారి సమక్షంలో పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు దారా వెంకటేశ్వరరావు(ధార బాబు), ఉప్పతల ఏడుకొండలు, సయ్యద్ రసూల్, భూపతి రమేశ్, సూర వెంకటేశ్వరరావు, గుగులోత్ శ్రీనివాస్‌నాయక్, వంకాయలపాటి బాబురావు, సత్తి నాగేశ్వరరావు, భూపతి శ్రీనివాసరావు, మద్దిరాల చిన్ని పిచ్చయ్య, బానోత్ రన్య, పూసం వెంకటేశ్వర్లు, చాపలమడుగు రామరాజు , ఓరుగంటి రాములు,శ్రావణ్‌కుమార్, కేశోత్ శ్రీను, బానోత్ బీలు, మంద అనిల్, బానోత్ రంగా పాల్గొన్నారు.

బహిరంగసభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

దమ్మపేట రూరల్, అక్టోబర్ 18 : పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై బుధవారం ఏఎస్ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. దమ్మపేట శివారులోని నల్లకుంట వద్ద పోతినేని శ్రీరామ వెంకటరావు పామాయిల్ తోటను ఆంధ్రాలోని ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, సీతానగరం గ్రామానికి చెందిన మోటపర్తి శ్రీనివాసరావు కౌలుకు తీసుకున్నాడు. తోటలోని పామాయిల్ గెలలను మంగళవారం కోస్తున్న కూరం రమేశ్(25)కు ప్రమాదవశాత్తు 33 కేవీ విద్యుత్ లైన్ తగిలి తీవ్ర గాయాలు కావడంతో రమేశ్‌ను స్థానిక ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సిఫార్సుతో ఖమ్మం తరలించారు. ఖమ్మంలో పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రతాప్ రెడ్డి తెలిపారు.